క్లుప్తంగా

పోలేరమ్మా.. కాపాడమ్మా..

రాయవరం: చెల్లూరులో పోలేరమ్మ అమ్మవారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. తమ పిల్లా పాపలను, పాడి పంటలను, పసుపుకుంకాలను చల్లగా చూడాలని కోరుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారికి జాతరను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్పంచ్ పాలిక రాఘవగోవిందు, ఉపసర్పంచ్ బుద్దాల రాంబాబు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, ఎంపీటీసీ వైట్ల వీరవేణి తదితరులు అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

మసీదు స్థల వివాదం పరిష్కారానికి కృషి



వివాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట

మండపేట: పట్టణంలోని కలువపువ్వు సెంటర్‌లో జామీయా మసీదు స్థలం వివాదం పరిష్కారానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థల సమస్యను రాజకీయం చేసి లబ్ధి పొందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. జామీయా మసీదు పక్కన జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై వివాదం నెలకొన్న విషయం విదితమే. తమ మసీదుకు చెందిన కొంత స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని ముస్లిం పెద్దలు ఆరోపిస్తుండగా, తమ డాక్యుమెంట్ల మేరకు నిర్మాణం చేసుకుంటున్నామని భవన యజమానులు అంటున్నారు. వివాదం నెలకొన్న స్థలాన్ని బుధవారం ఎమ్మెల్సీ తోట పరిశీలించారు. మసీదు పెద్దలు అల్తాఫ్, సయ్యద్ రబ్బానీ, మైనర్‌బాబు, సల్మాన్‌హుస్సేన్ తదితరులతో మాట్లాడారు. తమ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని వారు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఇప్పటికే స్థల సమస్యపై వక్ఫ్‌బోర్డు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పని చేస్తున్నారన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన తెలిపారు. మసీదు కమిటీ పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

ప్రభాకరరావుకు కృతజ్ఞతలు

మండపేట: పట్టణంలోని జామీయా మసీదు స్థలంలో అనధికార నిర్మాణాలు తొలగింపునకు వక్ఫ్‌బోర్డు నుంచి ఆదేశాలు తీసుకురావడంపై డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావుకు మసీదు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మసీదు స్థలం ఆక్రమణకు గురైనట్టు కామన ఫిర్యాదుపై అనధికార నిర్మాణాల తొలగింపునకు వక్ఫ్‌బోర్డు ఆదేశాలిచ్చింది. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో బుధవారం పలువురు ముస్లిం నాయకులు కామనను కలిశారు.

పంట నమోదు రైతుల జాబితా

కపిలేశ్వరపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 2022–23 రబీ పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాను ఆయా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. 15,882 ఎకరాలకు చెందిన 11,033 మంది రైతులు తమ పంటను నమోదు చేయించుకున్నారన్నారు. 13 గ్రామాల్లోని 618 ఎకరాల పంట పెండింగ్‌లో ఉందని తెలిపారు. వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నమోదు చేసుకునేందుకు ఈనెల పదో తేదీ వరకూ మరొక అవకాశం ఇస్తున్నామన్నారు. నేలటూరులో 7.11 ఎకరాల్లోనూ, వల్లూరులో 59.03, వడ్లమూరులో 0.96, కాలేరులో 14.82, నల్లూరులో 34.04, వెదురుమూడిలో 2.37 ఎకరాల్లో ఈకేవైసీ నమోదు పెండింగ్‌లో ఉందన్నారు. అంగరలో 8.5, పడమర ఖండ్రికలో 8.45, తాతపూడిలో 70.49, కపిలేశ్వరపురంలో 98.49, మాచరలో 224.23, వాకతిప్పలో 86.46, కోరుమిల్లిలో 3.39 మొత్తం 618.34 ఎకరాల్లో ఈకేవైసీ నమోదు పెండింగ్‌లో ఉందని ఏఓ తెలిపారు.

సహకార రంగాన్ని కాపాడండి



డీసీసీబీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షులు

రామచంద్రపురం రూరల్: సహకార సంఘాలను ఆదుకుంటూ ఆ రంగాన్ని కాపాడాలని నియోజకవర్గానికి చెందిన పీఏసీఎస్ అధ్యక్షులు కోరారు. వారు బుధవారం ద్రాక్షారామలో కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ ఎం.సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 10 ఏళ్ల క్రితం జరిగిన లావాదేవీలపై ఇప్పుడు స్పందించి, వడ్డీ రాయితీలను బ్యాంకులకు చెల్లించాలని ఏలాంటి సమాచారం లేకుండా మార్చి 30న సంఘాలకు ఎంట్రీ పాస్‌లు చేయడంతో ఆయోమయంలో పడ్డాయని సహకార సంఘాల అధ్యక్షులు తెలిపారు. ఇలా చేయటం వల్ల సహకార సంఘాలకు తీవ్ర నష్టం కలుగుతుందని, దీన్ని నిరసిస్తూ డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ద్వారా చైర్మన్ ఆకుల వీర్రాజుకు వినతిపత్రం అందించినట్టు డీసీసీబీ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షులు దామిశెట్టి వీరవెంకట చంద్రశేఖర్, పలివెల నాగరాజు, గీసాల శివ, మేకా జానకీరామయ్య, దంగేటి వెంకటరమణమూర్తి తదితరులు తెలిపారు.

మొదలైన రబీ కోతలు

- మరో వారంలో ముమ్మరం కానున్న మాసూళ్లు
- ధాన్యం కొనుగోళ్లకు సర్వం సిద్ధం
- ఆందోళన కలిగిస్తున్న వాతావరణం



మండపేటలో మొదలైన వరి కోతలు

మండపేట: రబీ పంట తుది దశకు చేరుకుంది. ముందుగా సాగు చేసిన పొలాల్లో వరి కోతలు మొదలయ్యాయి. మరో వారం రోజుల్లో దాళ్వా తుది దశ పనులు ముమ్మరం కానున్నాయి. పంట చేతికందే సమయంలో వాతావరణంలో మార్పులు ఆందోళనకు గురి చేస్తుండగా రైతులకు అండగా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో దాదాపు 92,862 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేశారు. అధిక శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1121, ఎంటీయూ 3626 రకాలను సాగు చేయగా కొద్ది విస్తీర్ణంలో ఆర్ఎన్ఆర్ 15048, తొలకరి పంటకు విత్తనాల కోసం స్వర్ణ రకం వంగడాలను సాగు చేశారు. ప్రస్తుత సీజన్‌లో 3.4 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. కాలువలకు ఎగువన ఉన్న మండపేట ప్రాంతం రైతాంగం ముందుగానే దాళ్వా సాగు చేపట్టారు. పంట కోతకు రావడంతో వరికోత యంత్రాలు గ్రామాలకు చేరుకుంటున్నాయి. మండపేట, మండలంలోని ఏడిద, పాలతోడు, వెలగతోడు, ఏడిద సీతానగరం తదితర గ్రామాల్లో కోతలు మొదలవుతున్నాయి. మరో వారం పది రోజుల్లో పూర్తిస్థాయిలో వరికోతలు జోరందుకుంటాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. సీజన్‌లో పంట తెగుళ్ల బెడద తక్కువగా ఉండడం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని వారంటున్నారు.

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం

పంట చేతికందే సమయంలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొద్ది రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతుండడం కలవరపెడుతోంది. మూడు వారాల పాటు వాతావరణం అనుకూలిస్తే చాలా వరకు పనులు పూర్తవుతాయని రైతులు అంటున్నారు.

రైతులకు అండగా..

డివిజన్‌లోని రెండు నియోజకవర్గ పరిధిలో దాదాపు 131 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ధాన్యం కొనుగోళ్లు చేయాల్సిన విధివిధానాలపై ఇప్పటికే తహసీల్దార్లు, సివిల్ సప్లయిస్, వ్యవసాయ అధికారులు సొసైటీ సీఈఓలు, వీఆర్‌ఓలు, వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులకు ఏ ఇబ్బంది కలుగకుండా పూర్తి పారదర్శకంగా కొనుగోళ్లు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఖరీఫ్‌లో మాదిరి కొనుగోలు చేసిన నిర్ణీత గడువు లోపలే ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు.

> **ఆశాజనకంగా వరి పంట**
>
> 
>
> రబీ వరి కోతలు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. పంట తెగుళ్ల బెడద తక్కువగా ఉండడం, వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
>
> –కె.ఏసుబాబు, మండల వ్యవసాయాధికారి, మండపేట

'జగనన్నే మా భవిష్యత్తు'ను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాటుపడాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహణపై బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, యువనేత తోట పృథ్వీరాజ్ తదితరులతో కలిసి గృహసారథులకు ఎమ్మెల్సీ తోట దిశానిర్దేశం చేశారు. గురువారం నుంచి ఈనెల 20వ తేదీ వరకూ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి స్థానికులతో మమేకం కావాలన్నారు. వారి అవసరాలు తెలుసుకోవడంతో పాటు గత టీడీపీ పాలనకు, వైఎస్సార్ ప్రభుత్వ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని, రాష్ట్రంలోని అన్ని వర్గాల వారి సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వివరించాలన్నారు. ప్రతిపక్షాల దుష్పచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. అవసరమైతే అదనంగా మరొక గృహ సారథి నియామకం చేసుకోవచ్చునని ఎమ్మెల్సీ తోట వివరించారు. జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి భవాని, నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, నౌడు వెంకటరమణ, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కార్పొరేషన్ల డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, అలీఖాన్‌బాబా, మండపేట అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు చోడే శ్రీకృష్ణ, శ్రీనివాసరావు, మండల జేసీఎస్ కన్వీనర్ బి.సాయిరాం, మండపేట అర్బన్, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

- ఘనంగా జయంతి వేడుకలు
- విగ్రహాలకు ఘన నివాళులు



పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, పృథ్వీరాజ్



పడమర ఖండ్రికలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

మండపేట: బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతికి దివంగత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక 7వ వార్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్సీ తోట పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, యువనేత తోట పృథ్వీరాజ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని ఏడిదలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి పాల్గొని జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. అర్తమూరులో జరిగిన వేడుకల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సామాజిక చైతన్యశీలి జగ్జీవన్‌రామ్

కపిలేశ్వరపురం: సామాజిక చైతన్యశీలిగా మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వెలుగొందారని బుధవారం ఆయన జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్ తదితరవక్తలన్నారు. పలు గ్రామాల్లో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. దళిత, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, నాయకులు మల్లిపూడి శివకుమార్, పిప్పర సంపతరావు, తాతపూడి రాజేష్ శర్మ, సుభాకర్, కొమ్ము బాబూరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

కాజులూరు: కాజులూరులో జరిగిన కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేగేశ్వరరావు పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. మాదిగ ఐక్యవేదిక చైర్మన్ కిశోర్‌బాబు, వీఆర్‌వోలు గోపాలరావు, సత్తిబాబు, రమణ, ధనరాజు, లాజరు, శేఖర్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం

రామచంద్రపురం: మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్టీల్‌విల్‌పేట, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల ఆయన విగ్రహాలకు మంత్రి వేణు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలోను, నరసాపురపుపేటలోను జరిగిన వేడుకల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మంత్రి తనయుడు నరేన్, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవానీ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. కె.గంగవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ కోట లక్ష్మీనరసమ్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. యర్రపోతవరంలో వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరావు, సర్పంచ్ పిల్లి రాంబాబు, ఉప సర్పంచ్ పలివెల మణిబాబు తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి వేణు తదితరులు

అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మేడిశెట్టి రాంబాబు పెదపూడి జయప్రకాష్, చంద్రమల్ల సురేష్, సుబ్బారావు అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరంలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ నౌడు వెంకటరమణ హాజరై మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకుని నేటి యువత సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు నూతనంగా నిర్మించిన షెడ్డును గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీను, ఎంపీటీసీ గంటి రోజా, బ్లడ్ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పసలపూడిలో జరిగిన వేడుకలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రూ.2.10లక్షలతో అభివృద్ధి చేసిన జగజ్జీవన్‌రామ్ విగ్రహం పైన వేసిన శ్లాబ్, ఇతర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజల ముంగిటకు ఫ్యామిలీ డాక్టర్

- గ్రామాల్లో మరిన్ని వైద్య సదుపాయాలు
- ఇప్పటివరకూ నిర్వహించిన ట్రైల్‌రన్ విజయవంతం
- ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నేడు ప్రారంభం



అంగరలో ఇంటికెళ్లి వృద్ధురాలికి సేవలందిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: విద్య, వైద్యం సమాజ ప్రగతికి రెండు చక్రాలు. ఆయా రంగాల్లో రాణిస్తే ఆ రాష్ట్రం ఆరోగ్యకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అదే జరుగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు–నేడు పథకంలో పాఠశాలల భవనాలను మెరుగుపరిచింది. ఇప్పుడు ప్రభుత్వ వైద్యుడుని, చికిత్సా విధానాన్ని నేరుగా పేదల ఇంటికే పంపుతోంది. నేడు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రారంభం సందర్భంగా ఈ కథనం..

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఇదీ..

అనారోగ్యంతో అవస్థ పడుతున్న రోగి ఇంటి వద్దకే వైద్యాన్ని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను రూపొందించింది. గతేడాది చివరలో ట్రయల్ రన్‌గా ప్రారంభమైన ఈ విధానం రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 15 పీహెచ్‌సీల పరిధిలో మంచి ఫలితాలనిచ్చింది. శేరిలంక పీహెచ్‌సీ పరిధిలో ఒకే ఒక్క గ్రామం ఉండడం, అక్కడ పీహెచ్‌సీ సేవలందుతుండడంతో కాన్సెప్ట్ నుంచి మినహాయించారు. మిగిలిన 15 పీహెచ్‌సీల్లోని 117 గ్రామాలకు వైద్యులు, సిబ్బంది ఇంటికి వెళ్లి వైద్యం చేస్తున్నారు. 104, పీహెచ్‌సీల వైద్యులు, అధికారులు, ఉద్యోగులు, వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలంతా సేవా దృక్పథంతో క్షేత్ర స్థాయిలో సేవలందిస్తున్నారు. నిర్దేశించుకున్న షెడ్యూలు ప్రకారం నెలలో రెండు రోజులు 104 వాహనంలో వైద్య సిబ్బంది గ్రామనికి వెళ్లి సేవలందిస్తారు. బీపీ, షుగరు, టీబీ తదితర 14 రకాల పరీక్షలు చేసే సాంకేతికతతో 104 వాహనాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఆధునీకరించింది. 67 రకాల మందులను ఉచితంగా అందజేసేందుకు సిద్ధం చేశారు. పరీక్షల రిపోర్టు ఆధారగంగా ఇంటి వద్దనే వైద్యుడు రోగికి తన ఆరోగ్య పరిస్థితిని వివరించి ధైర్యం చెప్తున్నారు.

పీహెచ్‌సీల వారీగా ప్రారంభం ఇలా..

పీహెచ్‌సీ	జనాభా	గ్రామాలు	కాన్సెప్ట్ ప్రారంభమయ్యే గ్రామం
అంగర	20,175	04	తాతపూడి
అచ్యుతాపురం	17,109	08	కాలేరు
ద్వారపూడి	44,904	06	అర్తమూరు
కేశవరం	22,784	06	ఇప్పనపాడు
మాచవరం	19,000	06	చెల్లూరు
గొల్లపాలెం	29,572	15	గొల్లపాలెం
దుగ్గదూరు	29,843	08	ఉప్పుమిల్లి
వెల్ల	23,452	14	నరసారావుపేట
పామర్రు	21,300	09	సత్యవాడ
దంగేరు	16,236	07	దంగేరు

నేడు ప్రారంభం ఇలా..

అమలాపురం జిల్లా 22 మండలాల్లోని 36 పీహెచ్‌సీల్లోనూ, కాకినాడ జిల్లా కాజులూరు మండలంలో ఉప్పుమిల్లి, గొల్లపాలెం పీహెచ్‌సీల్లోనూ కాన్సెప్ట్ నేడు ప్రారంభమవుతుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లోనూ ప్రారంభం కానుంది. ఆయా మండలాల్లో 16 పీహెచ్‌సీలుండగా వాటిలో తొలిదశలో 8 పీహెచ్‌సీల పరిధిలో ప్రారంభంకానుంది. ఆయా శిబిరాల్లో వైద్యులు అనూజ ప్రియాంక, కె.శివరంజని, జగదీప్, సీహెచ్ రమ్యశ్రీ, ఎం.చంద్రకుమారి, పి.ఉదయశ్రీ, టి.మాణిక్యం, ఎ.ఆదినారాయణలు, వై.సుప్రియ, సౌజన్య, శ్రేయ వైద్య సేవలందిస్తారు.

> **సకాలంలో సేవలు**
>
> 
>
> ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ట్రయల్ రన్ విజయవంతమైంది. వైద్యులకు, సిబ్బందికి మంచి అనుభవాలనిచ్చింది. ఆసుపత్రికి రాలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
>
> – డాక్టర్ జె.అనూజ ప్రియాంక, అంగర పీహెచ్‌సీ

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేస్తున్న బాబూరావు తదితరులు

కాజులూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు అన్నారు. గొల్లపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించనున్న అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణానికి స్థానిక ఎంపీటీసీ సభ్యులు జొన్నకూటి పద్మావెంకటేశ్వరరావుతో కలిసి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా త్వరలో గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఏర్పడి తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, పంచాయతీ పాలక వర్గ సభ్యులు రేఖపల్లి సత్తిబాబు, అంగర శ్రీను, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మండపేటలో బైరెడ్డి సందడి



సిద్ధార్థరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, యువనేత పృథ్వీరాజ్, శ్రీకృష్ణ తదితరులు

మండపేట: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బుధవారం మండపేటలో సందడి చేశారు. పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక ఆలమూరు రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన ముందుగా స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ యువనేతలు తోట పృథ్వీరాజ్, చోడే శ్రీకృష్ణ ఆయనను సత్కరించి దివంగత వైఎస్సార్ ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

బైరెడ్డి రాకతో పార్టీ కార్యాలయంలో పండగ వాతావరణం నెలకొంది. పార్టీ కార్యాలయంలో సమావేశానికి హాజరైన గృహసారథులు, పార్టీ శ్రేణులు ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు కనివినీ ఎరుగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు పాల్గొన్నారు.

నూతన వైద్య విధానాలపై అవగాహన



పీఎంపీలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చెలికాని నిహారిక

కాజులూరు: నూతన వైద్య విధానాలపై ఎప్పటికప్పుడు పీఎంపీలు అవగాహన పెంచుకుని గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పీఎంపీ అసోషియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. గొల్లపాలెంలో పీఎంపీ అసోషియేషన్ భవనంలో బుధవారం యానం, కరప, కాజులూరు, తాళ్ళరేవు మండలాల పీఎంపీ వైద్యులకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. మండల పీఎంపీ అసోషియేషన్ అధ్యక్షుడు జేవీవీ సూర్యానారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రభాకరరావు మాట్లాడారు. అనంతరం కాకినాడ శ్రీసత్య ఈఎన్టీ క్లినిక్ వైద్యురాలు డాక్టర్ చెలికాని నిహారిక ప్రథమ చికిత్సపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. సంఘం జిల్లా అధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు, రాష్ట్ర ముఖ్య సలహాదారుడు కెఎస్ఎన్ బాబు, కార్యవర్గ సభ్యులు విజయ్‌కుమార్, ఏడుకొండలు, సత్యానారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ రెడ్ క్రాస్ సొసైటీ రామచంద్రపురం, కె.గంగవరం మండలాలకు చెందిన పీఎంపీలకు ద్రాక్షారామలోని మార్కెట్ యార్డులో ఫస్ట ఎయిడ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రామచంద్రపురం పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ శిక్షణ జరిగింది. పీఎంపీలు పేర్లు నమోదు చేయించుకుని, మూడు రోజులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం

రాయవరం: గ్రామాల్లో గురువారం జరగనున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల లోపు ఏ సమయంలోనైనా అన్ని గ్రామాల్లోనూ జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల కన్వీనర్లతో పార్టీ గ్రామ అధ్యక్షుడు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్లు, వార్డు సభ్యులు, ఆ గ్రామ ముఖ్య నాయకులు, గృహ సారథులతో కార్యక్రమం దిశా నిర్దేశంపై చర్చించుకోవాలన్నారు. సమావేశాలు నిర్వహించిన ఫొటోలను మండల సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లకు, జెడ్పీటీసీ, ఎంపీపీలకు పంపించాలని ఆయన సూచించారు.

మోటారుసైకిల్ చోరీ

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ చేపల మార్కెట్టులో ఉంచిన మోటారు సైకిల్ చోరీకి గురైనట్టు ద్రాక్షారామకు చెందిన కర్రి సత్తిరాజు బుధవారం ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 3న సంఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ద్రాక్షారామ ఏఎస్సై దుర్గాభాయి తెలిపారు.

మోటారుసైకిళ్లు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన గోకరకొండ త్రిమూర్తులు తీవ్ర గాయాలపాలయ్యాడు. అతనిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పాపారావు తెలిపారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కె.గంగవరం: అముజూరు గ్రామానికి చెందిన వారా నాగేంద్రబాబు ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం జనసేన నాయకులు పొలిశెట్టి చంద్రశేఖర్ వారి కుటుంబ సభ్యలను పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరుపున నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

జన్మభూమి కమిటీలపై ఆరోపణలు సరికాదు

కపిలేశ్వరపురం: టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ ఖండించారు. ఇటీవల తనపైనా, టీడీపీ పైనా వైఎస్సార్ సీపీ నాయకులు చేసిన ఆరోపణలు నిరాధారమైనవని బుధవారం విలేకరుల సమావేశంలో చెప్పారు.